క్లుప్తంగా

ప్రత్యేక డీఎస్సీతో పోస్టులు భర్తీ చేయాలి

చింతూరు: ఏజన్సీ ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ ద్వారా స్థానిక గిరిజన అభ్యర్థులతో పోస్టులు భర్తీ చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సోడె మురళి కోరారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీతో పాటు ఏజన్సీ పోస్టులు కలిపి భర్తీ చేయడం వలన స్థానికులకు అన్యాయం జరుగుతుందన్నారు. జీవో నెం.3 పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, జూలై 21న విశ్వ కోయ భాష దినోత్సవాన్ని ఆదివాసీ గ్రామాల్లో పండుగలా నిర్వహించాలని ఆయన తెలిపారు. సభ్యులు వీరయ్య, ముత్తయ్య, రమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి



పనసలపాలెం ఆశ్రమ పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈవో తాతబ్బాయిదొర

వై.రామవరం: మండలంలోని పనసలపాలెం గ్రామ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఎంఈవో తాతబ్బాయిదొర సోమవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని హెచ్ఎం అప్పలనాయుడుకు సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ తప్పని సరిగా పాటించాలని ఆదేశించారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు మెరుగైన బోధన అందించాలని హెచ్ఎం, ఉపాధ్యాయులకు సూచించారు.

కేజీబీవీలో ఉత్తమ బోధన



మాట్లాడుతున్న ఎస్ఓ పరిమళ

కొయ్యూరు: స్థానిక కేజీబీవీలో విద్యార్థుల తల్లిదండ్రులతో విద్యాలయం ప్రత్యేకాధికారి పరిమళ సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందించడంలో కేజీబీవీ ముందు వరుసలో ఉందన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో ఉత్తమ, మెరుగైన విద్యను బోధిస్తున్నామన్నారు. మంచి పౌష్టికాహారం కూడా అందజేస్తున్నామన్నారు. కొందరు పిల్లలు చెప్పకుండా వెళ్లిపోతున్నారని, అలా వచ్చిన వారిని తల్లిదండ్రులు వెంటనే పాఠశాలకు తీసుకురావాలని సూచించారు. కేజీబీవీలో ఉన్న పిల్లలను చూసేందుకు తల్లిదండ్రులకు నెలలో ఒక రోజు కేటాయిస్తామన్నారు. తల్లిదండ్రులు అడిగిన పలు ప్రశ్నలకు ఆమె సమాధానం చెప్పారు.

పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



మాట్లాడుతున్న సీడీపీవో విజయకుమారి

కొయ్యూరు: మండల కేంద్రంలోని గిరిజన్ భవన్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో సీడీపీవో విజయకుమారి మాట్లాడుతూ గ్రామాల్లో బడిఈడు పిల్లలను గుర్తించి పాఠశాలలకు పంపించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రీప్రైమరీ పాఠశాలలకు వచ్చే చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రతీ నెల పిల్లల ఎత్తు, బరువును విధిగా నమోదు చేయాలన్నారు. కువి, ఒడిశా బాషల్లో ముద్రించిన పుస్తకాలను ఆయా కేంద్రాల్లో విధిగా బోధన చేయాలన్నారు. దూర ప్రాంతాలకు సరకులను తరలించడంతో వస్తున్న ఇబ్బందులను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి

మునగపాక : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చూచుకొండ సర్పంచ్ దొడ్డి సూరప్పారావు కోరారు. అతిసార సోకకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం మండలంలోని చూచుకొండ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయం చేసుకొని అతిసార ప్రబలకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు.

ఇంటికే పింఛన్లు... హామీలకే పరిమితం

- పెన్షన్‌దారులకు తప్పని అవస్థలు
- ఆరుబయట పడిగాపులు



అనంతగిరిలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీడీవో నగేష్ తదితరులు



దొడిపుట్టు పంచాయతీ భవనం వద్ద పింఛన్ కోసం నిరీక్షిస్తున్న పింఛన్‌దారులు

ముంచంగిపుట్టు/అనంతగిరి/అరకులోయ రూరల్/కొయ్యూరు/చింతపల్లి రూరల్/జి.మాడుగుల/గంగవరం/రాజవొమ్మంగి: ఇంటింటికీ పింఛన్ పంపిణీ చేయడంలో నూతన ప్రభుత్వం మొదటి నెలల్లోనే విఫలమైందని పింఛన్‌దారులు వాపోయారు. ఉదయం 6 గంటలకు ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తామని ప్రకటించిన హామీలు మాటలకే పరిమితమయ్యాయని పలువురు చెబుతున్నారు. సామాజిక పింఛన్లు పంపిణీపై కూటమి ప్రభుత్వం మొదటి నెలలోని మాట తప్పింది. ఇంటింటికే వెళ్లి సచివాలయం సిబ్బంది పింఛన్లు అందిస్తారని ప్రకటించిన ప్రగల్భాలు, హామీలు నీట మూటలుగానే మిగిలాయని చెబుతున్నారు. సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాలు టీడీపీ, జనసేన, బీజేపీ నేతల ఇళ్ల వద్దకు పింఛన్‌దారులను రప్పించి, స్థానిక సర్పంచులు, ఎంపీటీసీలను పక్కన పెట్టి కూటమి నాయకులతో పింఛన్ పంపిణీ చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే తెల్లవారుజామునే వలంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీ జరిగేదని, ప్రస్తుతం నూతన ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదని మళ్లీ పింఛన్ కష్టాలు మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యంతో ఉన్న వారు ఇబ్బందులతోనే పింఛన్ కోసం



జడ్డంగిలో పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చిందని, పింఛన్ కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చిందని పింఛన్‌దారులు వాపోయారు. జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ సజావుగా సాగినట్టు అధికారులు చెప్పారు. రాజవొమ్మంగి మండలంలోని లబ్బర్తి గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి సోమవారం ఉదయం ప్రారంభించారు. ఆ తరువాత దూసరపాము, రాజవొమ్మంగి,జడ్డంగి తదితర గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కింద్ర గ్రామంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి పింఛన్ల పంపిణీ లాంఛనంగా ప్రారంభించారు.

నానా అవస్థలు పడ్డాం



ఇంటికి వచ్చి పింఛన్ అందిస్తామని ప్రభుత్వం చెప్పి, పింఛన్‌దారుల అందరిని ఒక్క దగ్గరికి పిలిచి పింఛన్ అందిస్తున్నారు. మా ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తారని ఉదయం ఆరు గంటల నుంచి వేచి చూశాను .కానీ గ్రామంలోని పింఛన్‌దారులందరూ ఒక దగ్గరికి సచివాలయ సిబ్బంది పిలిచి పింఛన్ సొమ్ము ఇచ్చారు.అనారోగ్యంతో ఉన్న వృద్ధులు చాలా ఇబ్బందులు పడుతూ రావాల్సి వచ్చింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీర్లు ఇంటి గడప వద్దకు వచ్చి పింఛన్ ఇచ్చేవారు. ఇప్పుడు దానికి పూర్తి భిన్నంగా పింఛన్ ఇస్తున్నారు. రానున్న రోజుల్లో పింఛన్ కోసం మరిన్ని ఇబ్బందులు చూడాలో.

–కిరసాని డొంబాయి, పనస గ్రామం,
వనుగుమ్మ పంచాయతీ,
ముంచంగిపుట్టు మండలం

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



అడుగులపుట్టులో గర్భిణిని పరీక్షిస్తున్న వైద్యాధికారి సత్యశ్రీ



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

పెదబయలు: మండలంలోని అడుగులపుట్టులో గర్భిణులు, బాలింతలకు పెదబయలు పీహెచ్‌సీ వైద్యాధికారి సత్యశ్రీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 58 మంది వైద్య పరీక్షలు చేశారు. ఇందులో 30 మంది గర్భిణులు, ముగ్గురు బాలింతలతో పాటు స్థానిక ఎంపీయూపీ పాఠశాలకు చెందిన 25 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసినట్టు వైద్యాధికారి సత్యశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, డయేరియా, మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటుగా రోజు వారి ఆహారంలో వేడిగా ఉన్నవి మాత్రమే తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీరు మాత్రమే తాగాలని సూచించారు. గర్భిణులు ప్రతి నెల పరీక్షలు చేసుకోవాలని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం తీసుకోవాలని, సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేసుకోవాలని, అలాగే కాన్పు సమయానికి 10 రోజుల ముందుగానే ఆస్పత్రిలో చేరాలని కోరారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది పార్వతమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు,104 వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నియామకంలో నిర్లక్ష్యం తగదు



విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీటీసీ ఆనంద్‌కుమార్

అరకులోయ రూరల్: ఉపాధ్యాయుల నియామకంలో నిర్లక్ష్యం తగదని ఎంపీటీసీ సభ్యుడు దురియా ఆనంద్‌కుమార్ చెప్పారు. స్థానిక గురుకులం బాలుర పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పనిచేసిన 25 మంది ఒప్పంద బోధన సిబ్బందిని ప్రభుత్వం విధుల నుంచి తొలగించిందన్నారు. దీంతో పాఠశాల నిర్వహణకు ఇద్దరే ఉన్నారన్నారు. గిరిజన విద్యకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విద్యా ప్రమాణాలకు పెద్దపీట వేస్తే ప్రస్తుత ప్రభుత్వం కొత్త షరతులతో ఒప్పంద ఉపాధ్యాయ సిబ్బందిని తొలగించడం దారుణమన్నారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని బోధన సిబ్బందిని తక్షణమే నియమించాలన్నారు. పాఠశాలలో 27 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా ఇద్దరే ఉన్నట్టు చెప్పారు. ఈ విషయంపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తున్నట్టు చెప్పారు.

రైతులకు సూచనలు



సూచనలిస్తున్న ఏవో ఉమాదేవి

కొయ్యూరు: మండలంలోని సింగవరం గ్రామంలో మండల వ్యవసాయాధికారి ఉమాదేవి సోమవారం పర్యటించారు. గ్రామంలో పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పంటల సాగుపై స్థానిక రైతులకు పలు సూచనలిచ్చారు. ఇందులో భాగంగా ఆకుమడుల పెంపుపై అవగాహన కల్పించారు. ఐదు సెంట్లలో ఆకుమడిని వేసేటప్పుడు రెండు నుంచి మూడు బస్తాల ఊకను పెంటతో కలిపి వేస్తే ఆకుతీసేటప్పుడు సులభంగా వస్తుందన్నారు. పది సెంట్లలో వేసే ఆకుమడికి నాలుగు కిలోల యూరియా, ఎనిమిది కిలోల ఎస్ఎస్‌పి, రెండు కిలోల పొటాష్ వేయాలని సూచించారు. యూరియాను సగం విత్తనం చల్లిన తర్వాత, మిగిలిన సగం పది రోజుల తరువాత వేయాలన్నారు. విత్తనుశుద్ధి చేస్తే చాలా వరకు తెగుళ్లు నివారించవచ్చని సూచించారు.

చెట్టు కూలి ఇంటి పైకప్పు ధ్వంసం



వై.రామవరంలో ఇంటిపై కూలిన చెట్టు



శిథిలావస్థకు చేరుకున్న కల్వర్టును పరిశీలిస్తున్న జెడ్పీటీసీ బాలయ్య

వై.రామవరం: స్థానిక ఆశ్రమ పాఠశాలలో కుక్‌గా పనిచేస్తున్న ఎరిపోతు బుజ్జిబాబు నివాసం ఉంటున్న రేకుల ఇంటిపై సోమవారం ఉదయం కురిసిన గాలివానకు చింతచెట్టు కుప్పకూలి రేకులు ధ్వంసమయ్యాయి. రేకులు ముక్కముక్కలై ఇంట్లో పడ్డాయి. ఆ సమయంలో ఇంట్లోని వేరే గదిలో ఉన్న వారికి స్వల్ప గాయాలైనట్టు హెచ్ఎం పల్లాల లక్ష్మణరెడ్డి తెలిపారు. సంఘటనపై తహసీల్దార్ నాగరాజుకు ఫిర్యాదు చేసినట్లు హెచ్ఎం చెప్పారు.

చింతపల్లిరూరల్: గత నాలుగురోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో కొత్తపాలెం పంచాయితీ కప్పల గ్రామంలో కల్వర్టు శిథిలవస్థకు చేరింది. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య ఆ గ్రామాన్ని సోమవారం సందర్శించి కల్వర్టులను పరిశీలించారు.ఈ మేరకు గ్రామస్తులు చెబుతూ కల్వర్టు కూలడంతో తాము పండిస్తున్న పైనాపిల్ ,పనస , ఇతర పంటలను తరలించేందుకు ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.దీనిపై స్పందించిన జెడ్పీటీసీ బాలయ్య మాట్లాడుతూ సమస్యను కలెక్టర్ దినేష్ కుమార్, పాడేరు ఎమెల్యే విశ్వేశ్వరరాజు దృష్టికి తీసుకోని వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కప్పల గ్రామంలో ప్రభుత్వం పాఠశాల,అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి ,పాఠశాల ఉపాధ్యాయుల పనితీరును చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.వైఎస్సార్‌సీపీ నాయకుడు వనగల బెన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవోకు వినతి

చింతూరు: తమను అవమానించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజా ప్రతినిధులు చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్ మాట్లాడుతూ పింఛన్ల పంపిణీలో స్థానిక ప్రజా ప్రతినిధులమైన తమను ఆహ్వానించకుండా ఎంపీడీవో అధికార పార్టీ కార్యకర్తలతో పంపిణీ చేయించారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తమను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలని పీవో చైతన్యకు వినతి ఇచ్చినట్టు వారు తెలిపారు. సర్పంచ్‌లు ముచ్చిక నాగార్జున, కారం కన్నారావు, రవ్వ భద్రమ్మ తదితరులున్నారు.

కలెక్టర్ దృష్టికి పంచాయతీ సమస్యలు



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న హుకుంపేట సర్పంచ్ పూర్ణిమ

హుకుంపేట: పంచాయతీ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో ఆమె సోమవారం కలెక్టర్ దినేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నేపథ్యంలో హుకుంపేట పంచా యతీలోని డ్రైనేజీ, తాగునీటి సమస్య, వీధి రోడ్లు తదితర సమస్యలపై ఆమె వినతిపత్రం అందజేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆమె వినతిలో కోరినట్టు తెలిపారు.

రేషన్ పంపిణీ పరిశీలన



నెల్లిపూడిలో రేషన్ పంపిణీ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్ఐ జిలానీ



రాజుపేటలో రేషన్ పంపిణీ ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్



చింతూరులో రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న తహసీల్దార్ నజీముల్లాషా

గంగవరం/వీఆర్ పురం/చింతూరు: రంపచోడవరం నియోజకవర్గంలోని గంగవరం, వీఆర్ పురం , చింతూరు మండలాల్లో ఇంటింటికీ రేషన్ పంపిణీ సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని సరకుల పంపిణీని అధికారులు పరిశీలించారు. ఇందులో భాగంగా గంగవరంలో ఆర్ఐ ఫయాజ్ బాషా (జిలానీ), వీఆర్ పురంలో తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్, చింతూరులో తహసీల్దార్ నజీముల్లాషా పర్యవేక్షించారు. కార్డుదారులందరికీ రేషన్ పంపిణీ చేయాలని నిర్వాహకులకు ఆదేశించారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి

గంగవరం: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను ఎమ్మెల్యే శిరీష సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ ఆశ్రమ పాఠశాలు, వసతి గృహాలు మరింత అభివృద్ధి చేసేందుకు మరింత కృషి చేస్తామన్నారు. పిల్లలకు ఆహారం, ఆరోగ్య విషయాల్లో ప్రధానోపాధ్యాయులు, డిప్యూటీ వార్డెన్‌లకు సూచనలిచ్చారు. హెచ్ఎం ఆర్.వరలక్ష్మి, డిప్యూటీ వార్డెన్ ఎం.లావణ్య పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. విద్యార్థినులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివి ఉన్నతులుగా ఎదగాలన్నారు. మాజీ ఎంపీపీ తీగల ప్రభ, సర్పంచ్ అక్కమ్మ, వివిధ పార్టీల నాయకులు అర్జున, సిద్దూ, బుల్లియమ్మ, చిన్నారావు, విజయభాస్కర్, , గవరాజు, సత్యవేణి, ఏపీఎం జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు జన్మదిన వేడుకలు



అనాథశ్రమంలో చిన్నారులకు బర్త్‌డే కేకును తినిపిస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

సాక్షి,పాడేరు/జి.మాడుగుల/గూడెం కొత్తవీధి: పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు జన్మదిన వేడుకలు జిల్లాలోని పాడేరు, జి.మాడుగుల, గూడెం కొత్తవీధిలో సోమవారం ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా పాడేరులోని అనాథ ఆశ్రమం చిన్నారులతో కలిసి తన జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ఉత్సాహంగా జరుపుకున్నారు. చిన్నారులంతా ఎమ్మెల్యేకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. బర్త్‌డే కేకును ఎమ్మెల్యే కట్ చేసి వారికి తినిపించారు. బిస్కట్లు, చాక్లెట్లు పంపిణీ చేసి వారితో తన ఆత్మీయతను చాటుకున్నారు. అనంతరం అనాథశ్రమానికి బియ్యం, నిత్యావసర సరకులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వైఎస్సార్‌సీపీ నేతలు, అభిమానులంతా పుష్పగుచ్చాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిముడు కోటిబాబునాయుడు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బసవన్నదొర, కించూరు, సొలబం సర్పంచ్‌లు రాంబాబు, ఐసరం హనుమంతరావు, మాజీ సర్పంచ్‌లు పాంగి నాగరాజు, పాంగి సత్తిబాబు, మినుముల కన్నాపాత్రుడు, న్యాయవాది తమర్బ ప్రసాదనాయుడు, సత్యనారాయణ, రమణ తదితరులు పాల్గొన్నారు. జి.మాడుగులలో జరిగిన వేడుకలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మర్ర్రిని మత్స్యకొండంనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు గబ్బాడి సన్యాసిదొర, సర్పంచ్ ఐసరం హనుమంతరావు , సర్పంచ్ కిముడు రాంబాబు, ఎంపీటీసీ చిన్నారావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జల్లి సుధాకర్, నాయకులు చిట్టిబాబు, మన్మథరావు, వెంకటరమణ, అబ్బాయిదొర, కూర్మరాజు తదితరులు పాల్గొన్నారు. జీకే వీధిలో ఎంపీపీ బోయినకుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, నాయకులు అరుణ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీ కొని వ్యక్తి మృతి

సబ్బవరం: మండలంలోని గొల్లలపాలెం శివారు అమరపిన్నివానిపాలెం సమీపంలో ఆదివారం రాత్రి ట్రాక్టర్ ఢీ కొట్టి ఓ వ్యక్తి మృతి చెందాడు.బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు... మండలంలోని గొల్లలపాలెం గ్రామానికి చెందిన నేబర్తి పైడిరాజుకు అమరపిన్నివానిపాలెంలో మామిడి తోట ఉంది. ఆ తోటను వెదుళ్లనరవకు చెందిన ఎస్కే హలీమ్ లీజుకు తీసుకొని సాగుచేస్తున్నాడు. సదరు మామిడి తోట పనులు చేసేందుకు విజయనగరం జిల్లా ఎస్. కోటలోని బర్మా కాలనీకి చెందిన గొర్లి గురయ్య(45)ను నియమించాడు. భార్యతో కలిసి గురయ్య మామిడి తోటలోనే నివాసం ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి మామిడి తోట చదును చేసే పనుల్లో భాగంగా ట్రాక్టర్‌తో మట్టి తరలిస్తుండగా గురయ్యను ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఢీ కొట్టడంతో మృతి చెందాడు. అతని భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ పిన్నింటి రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్యతో పాటు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కుమార్తె వెంకటలక్ష్మి,ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న కుమారుడు సతీష్ ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు

వీఆర్ పురం: మండలంలోని రేఖపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో మండల పార్టీ కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కుల, మతాలకతీతంగా సంక్షేమ పథకాలు, అన్ని ప్రాంతాల అభివృద్ధి జరిగిందన్నారు. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఊహించని పరిణామం చోటు చేసుకుందన్నారు. రాజకీయాల్లో జయపజయాలు సహజమని, పార్టీ శ్రేణులు అధైర్య పడొద్దన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులకు అన్ని వేళల్లో అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. నాయకులు మాచర్ల గంగులు, పాడియం గోపాల్, ముత్యాల శ్రీనివాస్, ముత్యాల మురళి, చినమట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు, బొడ్డు సత్యనారాయణ, చిక్కాల బాలు, రేఖపల్లి ఎంపీటీసీ సభ్యురాలు బంధం విజయలక్ష్మి, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

4న నీట్ స్కామ్‌పై విద్యా సంస్థల బంద్

తుమ్మపాల: దేశంలో ఇటీవల జరిగిన నీట్ పరీక్షను రద్దు చేసి, అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 4న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ పిలుపునిచ్చారు. నీట్ నిర్వహణలో భారీ స్కాం జరిగిందని, బీహార్‌లో పోలీసులు పట్టుకున్న కొంత మంది పేపర్‌ని రూ.30 లక్షలకు విక్రయించినట్లు సీబీఐ వద్ద అంగీకరించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రపంచ యుద్ధాలనే ఆపగలిగే సత్తా ఉందని చెప్పుకునే మోదీ 23 లక్షల మంది వైద్య విద్యార్థుల జీవితాలను ఆందోళనలోకి నెట్టిన నీట్ పరీక్ష స్కాంను ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. డిమాండ్ల సాధన కోసం జూలై 4న చేపడుతున్న రాష్ట్ర వ్యాప్త బంద్‌కు విద్యా సంస్థలు, ప్రభుత్వం స్వచ్ఛందంగా మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బాబ్జీ, రమణ, కమిటీ సభ్యులు రాజేష్, శ్రీహరి పాల్గొన్నారు.

ముమ్మరంగా సాగు పనులు

మాడుగుల: అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రైతులు ఖరీఫ్ వరి విత్తనాలు వేస్తున్నారు. ఇప్పటికే వరి నారుమడులు సిద్ధం చేశారు. వర్షాలు కురవడం వల్ల పక్షం రోజుల వ్యవధిలో వరినారు పెరిగే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ఈ వర్షాలకు పెద్దేరు, తారకరామ, ఉరకగెడ్డ, జలాశయాల్లో నీటిమట్టం కొంత మేర ఆశాజనకంగా ఉంది. వరివిత్తనాలు చల్లుతున్నారు.

కళా సౌరభం.. సురభి నాటకం

మద్దిలపాలెం : తరతరాలకు చెరగని తీపి జ్ఞాపక పరిజ్ఞానం సురభి నాటక సౌరభమని నంది అవార్డు గ్రహీత డాక్టర్ మీగడ రామలింగస్వామి అన్నారు. పద్మశ్రీ బాబ్జీ తన నైపుణ్యంతో నేటి తరాలకు అందిస్తున్న అద్భుతం కళాఖండమని కొనియాడారు. సురభి నాటక ప్రదర్శనల్లో భాగంగా సోమవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో లవకుశ నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించిపోతున్న అద్భుతాన్ని నేటి తరానికి అందించడానికి ప్రతి ఏడాదీ బాదంగీర్ సాయి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. బాదంగీర్ సాయి మాట్లాడుతూ రంగసాయి నాటక సంఘం పద్మశ్రీ బాబ్జీ పేరిట జీవన సాఫల్య పురస్కారాన్ని నాటక రంగ ప్రముఖులకు అందించనున్నామని ప్రకటించారు. లవకుశ నాటకం ఆద్యంతం ప్రేక్షకుల హృదయాలను రంజింపజేసింది. శ్రీరాముడి పట్టాభిషేకంతో ప్రారంభమైన నాటకం.. శ్రీరాముడు అయోధ్య రాజ్యాన్ని శాంతియుతంగా పరిపాలిస్తున్న తీరును చక్కని సన్నివేశాల నడుమ ప్రదర్శించారు. లవకుశల పాత్రల్లో కళాకారులు రక్తికట్టించారు. ప్రేక్షకులు తమ కరతాళ ధ్వనులతో నీరజనాలు పలికారు.